వణుకు పుట్టిస్తున్న.. వంశీనగర్ గెడ్డ


ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన వంశీనగర్ గెడ్డ


జ్యోతి నగర్ వద్ద గెడ్డలో నిలిచిపోయిన మురుగు నీరు

చెత్త, మురుగునీటితో నిండిపోయిన వైనం

శాశ్వత పరిష్కారం చూపాలంటున్న స్థానికులు

గెడ్డలో చెత్త వేసే వారిలో చైతన్యం రావాలని పలువురి సూచన

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు జాతీయ రహదారి హైవే పక్కన ఉన్న వంశీనగర్ గెడ్డ వణుకు పుట్టిస్తోంది. చిన్నపాటి వర్షానికే గెడ్డ మొత్తం చెత్తతో నిండిపోయి మురుగు నీరు ఇంటోక్లి చేరిపోతూ స్థానికులను నానా ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇటీవల వర్షం కురిసి గెడ్డ మురుగు, చెత్తతో నిండి పోయింది. ఈ గెడ్డ మధవధార నుంచి మాధవధార జంక్షన్ మీదుగా.. వంశీనగర్ నుంచి జాతీయ రహదారి అవతల వైపు జ్యోతినగర్ గెడ్డకు అనుసంధానం అవుతుంది. **ఈ ప్రక్రియలో ఇక్కడి పైపులైన్లు పూర్తిగా వ్యర్థాలతో నిండిపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయింది. గెడ్డలో స్థానికులు పాడైపోయిన పరుపులు, మంచాలు, ప్లాస్టిక్ వస్తువుల వంటివి పడేయడంతో నిండిపోయి నీటి ప్రవాహం ఆగిపోతోంది. అయిదు రోజుల క్రితం** వర్షం కురవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆ రోజు సాయంత్రం నుండి సంబంధిత అధికారులు వచ్చి పనులు చేపట్టారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి రాత్రీపగలు వ్యర్థాలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నా ఆదివారానికి కూడా పరిష్కారం కాలేదు. ముందుగా మోటార్ల ద్వారా నీటిని మ్యాన్‌హోల్‌లోకి తోడుతున్నారు. జాతీయ రహదారి మధ్యలో డివైడర్ వద్ద ఉన్న ఓ పెద్ద వృక్షాన్ని పూర్తిగా వేర్లతో సహా తొలగించారు. నీటి ప్రవాహం వస్తుందేమో అని ఆ ప్రాంతంలో సుమారు 20 అడుగులు తవ్వి చూశారు. రహదారి మధ్యలో ఉన్న గెడ్డ అనుసంధానమై ఉన్న పైపులు పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి పైపులైన్లు మూసుకుపోయాయి. దీంతో పలు యంత్రాల సహాయంతో


చెట్టును తొలగించిన గోతిలో కదలకుండా నిలిచిపోయిన మురుగు నీరు

తవ్వి పైపులను విరగ్గొట్టే పనులు చేస్తున్నారు. అయినా మురుగు నీరు మాత్రం కదల్లేదు. ఆ ప్రాంతమంతా ఆక్రమణకు గురి కావడంతో గెడ్డ పూర్తిగా కుదించుకుపోయింది. అక్రమ నిర్మాణాలు తొలగిస్తే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదని పట్టణ ప్రణాళిక అధికారులకు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు లేఖ ద్వారా తెలిపారు. దీంతో అక్కడ ఉన్న షెడ్డును తొలగించారు.

ప్రత్యేక అనుభవం ఉన్నవారే చేయగలరు..

ఇక్కడి పనివారు ఈ సమస్యను పరిష్కరించలేకపోవడం వల్ల భీమవరం, విజయవాడలో ఉన్న కాంట్రాక్టర్లతో అధికారులు మాట్లాడారు. అయితే అక్కడి కాంట్రాక్టర్ ఇదిగో వస్తున్నాం.. అదిగో **వస్తున్నాం అంటున్నారే తప్ప ఎవరూ ఇంత వరకు రాలేదు. గతంలో నగరానికి చెందిన ఓ కాంట్రాక్టర్ జ్ఞానాపురం గెడ్డ ఇలాగే చెత్తతో మూసుకుపోయి మురుగు నీరు ప్రవహించకపోతే ఆ సమస్యను పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. వారితోనే** ఇప్పుడు చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. అయితే ఓ పైపులైను తవ్వి చెత్తను తొలగించడానికి సుమారు రూ. లక్షా ఇరవై వేల నుంచి రూ. లక్షా ఏభై వేల వరకు ఖర్చు అవుతుందని, అలాంటివి రెండు పైపుల్లో చెత్తను తొలగించాలంటే మరెంత డిమాండ్ చేస్తారో అంటున్నారు. దీనికి సంబంధించి ప్రస్తుతం బేరాలు జరుగుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా ఎంత త్వరగా అయితే అంత త్వరగా వ్యర్థాలు తొలగించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి

కాలనీవాసులు బాధ్యతగా ఉండాలని పలువురు హితబోధ చేస్తున్నారు. వంశీనగర్‌లో సుమారు 400 కుటుంబాలు ఉంటాయి. ఇంటి వద్దకు క్లాప్ వాహనం వచ్చినప్పుడు చెత్తను అందించి ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి రాకపోయి ఉండేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కన ఉన్న షాపులు, అలాగే ఆ రోడ్డు పక్కనున్న స్థానికులు కంటి మీద కునుకు లేకుండా పహారా కాస్తున్నారు. ఏ సమయంలో వర్షం వస్తుందో తెలియక తికమక పడుతున్నారు. గతంలో కూడా ఇలాగే జరిగి ఇంట్లోకి మురుగు నీరు చేరడంతో ఖరీదైన గృహోపకరణాలు నీటిలో మునిగిపోయాయి. అంతే కాక బయట పార్కు చేసిన కార్లు సైతం నీట మునిగిపోయాయి. దీంతో గెడ్డ పొంగిందంటే వణుకు పుడుతుందని చెబుతున్నారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి వస్తుందేమో అని గత 40 ఏళ్లుగా అక్కడే నివసించేవారు చెబుతున్నారు. ఎవరికి తోచినట్లు వారు చెత్తను కవర్లతో తీసుకొచ్చి ఇష్టానుసారం గెడ్డలో విసిరేస్తుండడం వల్లే అది చెత్త, మురుగుతో మూసుకుపోయి నీరు పారడం లేదంటున్నారు. అధికారులు సరైన చర్యలు తీసుకుని ఈసారైనా చెత్త వెళ్లి ఏ సందులోనో చిక్కుకుపోకుండా ఎక్కడికక్కడ గ్రిల్స్ వంటివి ఏర్పాటు చేస్తే కేవలం మురుగు నీరు మాత్రమే పోతుందంటున్నారు. గ్రిల్స్ వద్ద నిలిచిపోయిన చెత్తను సులువుగా పారిశుధ్య కార్మికులు తొలగించవచ్చని చెబుతున్నారు. ఒక పక్క మురుగు నీరు ఇంట్లోకి వచ్చేస్తుందేమోననే భయం, మరో పక్క దోమలు, పందులు, ఈగలు, విష జంతువులతో అవస్థ పడుతున్నట్లు తెలిపారు.


మోటార్ల సహాయంతో నీటిని మ్యాన్‌హోల్‌లోకి తోడుతున్న దృశ్యం


మాధవధార జంక్షన్ వద్ద గెడ్డలో పడేసిన వ్యర్థాలు

క్లుప్తంగా

కల్వర్టుపై సిమెంట్ పలకల ఏర్పాటు


మహారాణి పార్లర్ కూడలిలో కల్వర్టుపై అమర్చిన పలకలు

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు 80 అడుగుల రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్ కల్వర్టుపై సిమెంట్ పలకలు అమర్చారు. ఈ మార్గంలో కొద్ది రోజుల కిందట డ్రెయిన్ బ్లాక్ అవడంతో చెత్త తొలగించడానికి మహారాణి పార్లర్ కూడలిలో రెండు చోట్ల డ్రెయిన్ కల్వర్టుకు కన్నాలు పెట్టారు. చెత్త తొలగించాక కన్నాలు మూసివేయకుండా అలాగే వదిలేశారు. ఈ సమస్యపై 'ప్రమాదకరంగా డ్రెయిన్ కల్వర్టు' అనేక శీర్షికన గత నెల 28న 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. శనివారం రెండు డ్రెయిన్ కల్వర్టులపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రమణ

సీతంపేట: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ డి.వి.రమణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో, క్రమశిక్షణతో మెలగాలని, ఇకపై ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు రౌడీ షీటర్ల కదలికలన్నీ పోలీసుల సర్వేలెన్స్‌లో ఉంటాయన్నారు. సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ మూసేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపిస్తామని చెప్పారు. నేర జీవితాన్ని వదిలి కుటుంబంతో కలిసి మంచి జీవితాన్ని గడపాలని సూచించారు.

మౌల్డింగ్ ఆర్ట్‌పై శిక్షణ


మౌల్డింగ్ ఆర్ట్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం మౌల్డింగ్ ఆర్ట్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణలో సీనియర్ వాకర్ పాండూరు సూర్యనారాయణ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కళలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఖాళీ సమయంలో తమకు నచ్చిన కళలో ప్రవేశం పొంది సాధన చేయాలన్నారు. చిత్రలేఖనం వల్ల ఉన్నత భావాలు ఏర్పడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, సహాయ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు పాల్గొన్నారు.

25న మిరాకిల్ టాలెంట్ పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్నారులు, అతిథులు

దాబాగార్డెన్స్: మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న మిరాకిల్ టాలెంట్ ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు, కొరియోగ్రాఫర్ మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ చిన్నారులచే పోస్టర్ ఆవిష్కరించి, పోటీల వివరాలు వెల్లడించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఆ రోజు ఉదయం 9.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. క్లాసికల్, వెస్టర్న్ డ్యాన్స్, సింగింగ్, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫోక్ డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, గెటప్స్, డైలాగ్స్, ట్రెడిషనల్, ఫ్యాన్సీ డ్రెస్ తదితర పోటీలు ఉంటాయని, అన్ని వయసుల వారు అర్హులేనని చెప్పారు. పోటీలో పాల్గొనదలిచే వారు 99664 85335, 95533 33134 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా నీట్


గైస్ కేంద్రం వద్ద పరీక్ష అనంతరం పిల్లలను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

మురళీనగర్: మెడిసిన్‌లో ప్రవేశానికి సంబంధించి జాతీయ స్థాయిలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మురళీనగర్ పరిసరాల్లోని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గైస్‌లోని పరీక్ష కేంద్రానికి 480 మందిని కేటాయించగా.. 471 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి 480 మందిని కేటాయించగా.. 474 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు. ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. వీరిని ఉదయం 11 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత విద్యార్థులను అనుమతించలేదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. దివ్యాంగులకు ఒక గంట అదనంగా సమయం కేటాయించారు. గైస్ కేంద్రం సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.వెంకటరమణ, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా డి.దామోదర్, కేంద్రం పరిశీలకుడిగా సిహెచ్. మురళీకృష్ణ వ్యవహరించారు. నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష అనంతరం కేంద్రాల వద్ద తమ పిల్లలను తల్లిదండ్రులు రిసీవ్ చేసుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి విశాలాక్షినగర్‌కు చెందిన సుంకర శ్రీరాములు దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. సింహగిరిపై ఉన్న దేవస్థానం పీఆర్‌వో కార్యాలయంలో వారు ఈ విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్‌ను అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

పత్రికారంగ అగ్రగణ్యులు దాసరి, మానికొండ


మాట్లాడుతున్న ఆచార్య బాబీవర్ధన్

సీతంపేట: సినీ దర్శకుడు దాసరి నారాయణరావు, పాత్రికేయులు మానికొండ చలపతిరావు మధ్య సామాజికంగా సారూప్యత ఉందని ఏయూ జర్నలిజం మాజీ విభాగాధిపతి ఆచార్య బాబీవర్ధన్ అన్నారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో దాసరి నారాయణరావు జయంతి, అమరయ్య ఆకుల రచించిన 'మానికొండ చలపతిరావు' పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛ మనిషి ప్రాణం వంటిదని నేషనల్ హెరాల్డ్ పత్రికను చలపతిరావుకు అప్పగించినపుడు అప్పటి ప్రధాని నెహ్రూ భావించారన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో నేషనల్ హెరాల్డ్ అగ్రస్థానంలో ఉండేదని, అక్షరాలను సంధించి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చలపతిరావు ఆ పత్రికలో వ్యాసాలు రాశారని గుర్తు చేశారు. పత్రికలో ఎప్పుడు ఉంటామో లేదో అని చలపతిరావు రాజీనామా పత్రాన్ని జేబులో పెట్టుకుని పని చేసేవారని తెలిపారు. ఆంధ్రరాష్ట్రంలో పుట్టి అంతర్జాతీయంగా మానికొండ చలపతిరావు పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ప్రజల పక్షాన పత్రికలు నిలబడాలంటే దాసరి వంటి వారు మళ్లీ పుట్టాలని ఆకాంక్షించారు. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న సమయంలో తాతా మనవడు వంటి చిత్రాన్ని దాసరి తీశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాల వెంకటరావు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కటారి అప్పారావు, పాత్రికేయులు సాగర్ కుమార్, పిల్లల రామకృష్ణారావు, పుస్తక రచయిత ఆకుల అమరయ్య, రైటర్స్ అకాడమీ అధినేత వి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి


స్కూల్ యూనిఫాంలో సెయింట్ పీటర్స్ స్కూల్ పూర్వ విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ బాలుర ఉన్నత పాఠశాలలో 2000–01 సంవత్సరానికి చెందిన టెన్త్ విద్యార్థులు ఆదివారం భీమిలిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఉత్సాహంగా గడిపి పాత అనుభూతులను పంచుకున్నారు. 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో తమ పాఠశాలలో చిన్ననాటి సంఘటనలు, జ్ఞాపకాలు పంచుకున్నారు. పాఠశాల లోగోతో కూడిన యూనిఫాం ధరించి ఆనందం వ్యక్తం చేశారు. తమ జీవితాలను మార్చిన ఉపాధ్యాయులకు ఎంతో రుణపడి ఉంటామని తెలిపారు.

7 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

మహారాణిపేట: నేటి స్పీడ్ యుగంలో విద్యార్థులు, ఉద్యోగులు, వయోవృద్ధులు మానసిక ఒత్తిడికి లోనై అనేక రుగ్మతల పాలిట పడుతున్నారు. క్షణికావేశంలో పొరపాట్లు చేస్తున్నారు. ఒత్తిడి నివారణకు యోగా చేయాలని ప్రకృతి చికిత్సాలయం యోగ సాధకురాలు డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి అందరికీ ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. బీచ్‌రోడ్డులో ఉన్న ప్రకృతి చికిత్సాలయంలో ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. వయోభేదం లేకుండా స్త్రీ, పురుషులు, విద్యార్థులు అందరికీ ఉచితంగా నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డాక్టర్ శ్రీలక్ష్మి కోరారు. ఔత్సాహికులు గోకుల్ పార్కు ఎదురు రోడ్డు, బుద్దవరపు గార్డెన్స్, మహారాణిపేటలో గానీ 9866077307 నంబర్లో గానీ సంప్రదించాలన్నారు.

అలరించిన వినోదాల విందు


స్కిట్ ప్రదర్శిస్తున్న ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ సభ్యులు

సీతంపేట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వినోదాల విందు పేరిట ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, గణేష్, కుమారి, పుష్పమి, గోపీకృష్ణ, జీవీ లక్ష్మి, నరసింగరావు, నిరోషా ప్రదర్శించిన స్కిట్లు అలరించాయి. వీటిలో జడ్జిమెంట్, స్లిప్, హింస, సబ్బవరం, చల్లగా ఉండు, డాక్టర్ పేషెంట్, ఛానల్ ఓపెన్ అయ్యింది, సూర్య నమస్కారాలు, ఓటీపీ, పొదుపు, పచ్చడి నాటికలు ఆహుతులను నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ సందర్భంగా అల్లు వెంకటరమణ శిష్యులు అనూష, అనన్య, పింకీ శాస్త్రీయ నృత్యంతో అలరించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

దాబాగార్డెన్స్: అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఈనెల 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుందన్నారు. చెన్నైలోని సామ్‌సంగ్ కంపెనీలో కార్మికులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న యూనియన్‌ను రిజిస్టర్ చేయకుండా యాజమాన్యం, ప్రభుత్వం అడ్డుకున్నాయన్నారు. లేబర్‌కోడ్ అమల్లోకి వస్తే కార్మికులు ఏ కష్టం వచ్చినా సమస్య పరిష్కారానికి సమ్మె చేయలేరని, అలా చేస్తే ఒక రోజు సమ్మెకు 8 రోజుల వేతనం కోల్పోతారన్నారు. నాయకులను జైల్లో పెట్టి నిర్బంధించవచ్చని, యూనియన్ రిజిస్ట్రేషన్, గుర్తింపు రద్దు చేయవచ్చని, లక్షలాది రూపాయల జరిమానా విధించవచ్చన్నారు. మరోవైపు ఇప్పటి వరకు కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చెల్లించని యజమానులకు జైలు శిక్ష పడేదని, దానికి భయపడి కట్టేవారన్నారు. యజమానులు జైలుకెళ్తే బెయిల్ రావాలంటే 50 శాతం చెల్లించాల్సి ఉండేదన్నారు. కానీ లేబర్ కోడ్‌లో యజమానుకు ఈ శిక్షలు ఎత్తివేశారన్నారు. కార్మికుల పాలిట శాపంగా మారే లేబర్‌కోడ్ల రద్దుకు పోరుబాట పట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమణబాబు, సురేష్, హెచ్ఎంఎస్ నాయకుడు మంగయ్య నాయుడు, సిటు గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు, త్రినాథరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మణరావు, సీఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు కనకారావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు బి. వెంకట్రావు, సిటు కార్యదర్శి బి. జగన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు పంపిణీ చేస్తున్న రాగం కిషోర్

కంచరపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైజాగ్ సీ-పోర్ట్ వైస్ చైర్మన్, పినాకిల్ ఎండీ రాగం కిషోర్ పేర్కొన్నారు. జ్ఞానాపురం పరిధిలో రంజిత్ కుమార్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత డాక్టర్ దాసరి బుజ్జి నేతృత్వంలో ఆదివారం మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు అందజేశారు. ముందుగా చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రాపాక యాదవ్, కొయిలాడ శ్రీనివాసరావు, సుభాషిణి, పద్మ, భవిత, ఉమా, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణ


శిక్షణకు హాజరైన గురుకుల ఉపాధ్యాయులు

సీతంపేట: ఆంగ్ల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంపొందించే దిశగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం శంకరమఠం రోడ్డులోని ఒక హోటల్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా సొసైటీ డీసీవో డాక్టర్ సి.ప్రభావతమ్మ మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయుల్లో ఇంగ్లిష్ బోధనా సామర్థ్యం మెరుగుపర్చడానికి ముంబైకి చెందిన కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకున్నట్టు తెలిపారు. కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఫ్యూచర్ రెడీనెస్ అంశంపై మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గురుకుల ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, కోటక్ ఫౌండేషన్ ప్రతినిధులు నూథన్, ఫర్షిత్ పంతక్, జ్యోతి శిక్షణ ఇచ్చారు.

కార్పొరేటీకరణను ప్రతిఘటించాలి

దాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెకు ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ (ఐటీయూసీ) అనుబంధ కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా (సీఎఫ్‌టీయూఐ) సిద్ధమైనట్టు సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ, కార్మిక, ఉపాధి శాఖమంత్రి డాక్టర్ మన్సుఖ్‌ఎల్ మాండవీయకు లేఖ పంపినట్టు పేర్కొన్నారు. ప్రజల ఉనికికి ముప్పుగా మారుతున్న కార్పొరేటీకరణను ప్రతిఘటించడమే సమ్మె ముఖ్యోద్దేశంగా పేర్కొన్నారు. దేశంలోని కార్మికులు, రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, ఉద్యోగావకాశాల కొరత, ప్రజల జీవనోపాధిపై కార్పొరేట్‌కు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు లక్షలాది మందిని పేదరికంలోకి నెట్టివేయబడ్డాయన్నారు. అసంఘటితరంగ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, స్కీమ్ వర్కర్లతో సహా కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస పెన్షన్ రూ.9 వేలు, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులతో సహా అన్ని వర్గాల కార్మికులకు సామాజిక భద్రత, గృహ ఆధారిత కార్మికులు, హ్యాకర్లు, రాగ్ పిక్కర్లు, గృహ కార్మికులు, నిర్మాణ రంగ కార్మికులకు భద్రత, కనీస వేతనం అందజేయాలని మోదీకి పంపిన లేఖలో పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో మోసంపై ఫిర్యాదు

సీతంపేట: ఒక మహిళను ప్రేమ పేరుతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై నాల్గవ పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంచరపాలేనికి చెందిన అనితకు గతంలో వివాహం జరిగి, మనస్పర్థల కారణంగా భర్తతో విడిపోయి పుట్టింట్లో ఉంటోంది. ఈమెకు వరంగల్ జిల్లా మంచిర్యాల ప్రాంతానికి చెందిన వినయ్‌తో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి శారీరకంగా ఒక్కటయ్యారు. తీరా ఆమెను పెళ్లి చేసుకోవడానికి వినయ్ నిరాకరించడంతో ఫిర్యాదు మేరకు అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి మహిళలకు శిక్షణ

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ మంగళవారం నుంచి ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు వైరు బ్యాగులు, క్రోస్య వైర్ బ్యాగులు, టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు 92901 87148 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.